# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, ఏప్రిల్, 2018 ₹ 30

ISSN 2454–4329

# మిసిమి

## ఏప్రిల్ నెల సూచికలు...


కమ్మ తెమ్మెరలు : ... 5

భారతీయ తాత్త్విక చింతన : పిళ్ళా కుమారస్వామి... 6



శంకరంబాడి

ప్రసన్న కవి ప్రతిభ : ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు... 13

తెలంగాణా సుల్తాని : దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు... 22

బొబ్బిలి నాటక ప్రాశస్త్యం : ఆచార్య కె. దామోదరనాయుడు... 25





సాంకేతిక భాషా వికాసం : డా. డి.వి.ఎన్.డి. లక్ష్మి... 30

రాయలసీమ రైతు కథ : డా. కరణం శ్రీనివాసులు రెడ్డి... 36

అన్నమయ్య వలపు రాగాలు : గూడూరు యానాదిరాజు... 41

నేటి వ్యావహారిక భాషా విశేషాలు : లింగంనేని బసవశంకరరావు... 44

ఎడిటర్స్ డైరి : వల్లభనేని అశ్వినీకుమార్... 51



ఆలపాటి రాజా

తాళ్ళపాక తిమ్మక్క సుభద్రా కళ్యాణం : డా. జె. కనకదుర్గ... 54



చంద్రలేఖ

తమిళ సినిమా చరిత్ర : డా. లక్ష్మీ అయ్యర్... 60

శైలీశాస్త్రం : టి. సతీశ్... 65

కామరూన్ కినిమా : మిసిమి... 70



జేమ్స్ కామరూన్

కాళి బీడి : రాయవరపు సత్యానారాయణ... 75

కాంగోలో ఓ తోటరాముడు : ఐ.వి. రామరాజు... 77

ఈశాన్య భారతం.... మేఘాలయ : ముకుంద రామారావు... 79



జోషి

నవనిర్మాణ శిల్పి – విఠల్‌దాస్ జోషి : కాంగ్రేగుల నాగేశ్వరరావు... 82

జాతి గుండె చప్పుడు : వేంపల్లి అబ్దుల్ ఖాదర్... 84



శికిబు

మురాసకి శికిబు : వేలూరి కృష్ణమూర్తి... 90

పురుడు : అందెశ్రీ... 92




తల్లి దీవెన



ఇత్తఱి ఘోషించె
మునాదియెల్లరకు
భ్రాతఃపానగూఢార్థముల్....

ముఖచిత్రం : దీవెన
చిత్రకారుడు: శశికాంత్ వామన్ దాత్రే

రెండవ అట్ట :
చిత్రకారుడు
తల్లావజ్ఝల శివాజి

మూడవ అట్ట :

నాల్గవ అట్ట : తవదీనా–సావిరహే
చిత్రకారుడు : పరాగ్ బోర్సే



బూపంబును జేతికిచ్చి తినవద్దని
చెప్పుట యేల దైవమా?



తవదీనా–సావిరహే

వివరాలు 50వ పుటలో...

# భారతీయ తాత్త్విక చింతన

– పిల్లా కుమారస్వామి

భారతీయ తాత్త్విక చింతనంతా ఒకే రకంగా సాగుతోందని అది బ్రహ్మ, ఆత్మ, మోక్షం మొదలైన భావవాదం చుట్టూ తిరుగుతూ వుందని ఆధ్యాత్మిక వాదులు నిత్యం ప్రచారం చేస్తూవున్నారు. వాస్తవానికి భావవాదానికి భౌతిక వాదానికి మధ్య జరుగుతున్న సంఘర్షణే భారతీయ తాత్త్వికచింతన.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ రాసిన భారతీయ తత్త్వ శాస్త్రం–సులభపరిచయం (అనువాదం డా॥ గూడ సుందరరామయ్య) గ్రంథం భారతీయ తాత్త్విక చింతనపై సంపూర్ణంగా కాకపోయినా ఒక అవగాహన పెంపొందించుకునేందుకు సులభపరిచయం రాశారు. ఈ గ్రంథంలో ఆయన విశ్లేషించినట్లు రెండు భావధారలు సమాంతరంగా సాగినాయి. అవి భావవాదం, భౌతికవాదం. అయితే అవి ఎలా సంఘర్షించాయో వాటిమధ్య మళ్ళీ సామరస్యం ఎలా కుదిరిందో తెలుసుకోవాలంటే ఈ గ్రంథం తప్పక చదవాలి.

భారతీయ తాత్త్విక చింతనను తెలుసుకోవాలంటే అత్యంత ప్రాచీన సాహిత్యమైన వేదసాహిత్యం నుంచి మొదలుపెట్టాలి. దాదాపు 5000సంవత్సరాల క్రిందటి వేద సాహిత్యం. విజ్ఞానాభివృద్ధి ప్రాథమిక దశలో వున్నదశలో ఏర్పడిన భావాలు మెల్లమెల్లగా సాహిత్యరూపం దాల్చి వేదసాహిత్యం తయారయ్యింది. వేద గ్రంథాలన్నీ క్రీ.పూ.1000–600 మధ్య ప్రాంతాలలో సంకలనం చేయబడినాయని ఈ వేదాలను క్రీ.పూ.1500 ప్రాంతంలో ప్రాముఖ్యంలోకి తెచ్చివుంటారని పరిశోధకులు భావిస్తున్నారు. ఏమీ తెలియని కాలంలో ప్రతి సంఘటనను దైవశక్తికి ఆపాదించారు. వానకు, మేఘానికి, అగ్నికి, సముద్రానికి, గాలికి ఇలా ప్రతి దానికి ఒక దేవతను సృష్టించుకున్నారు. అందువల్లనే వేదాల్లో చాలామంది దేవతలు కనిపిస్తారు. వేదాల్లో వున్నదంతా గేయాలు, కవితలు తప్ప మరేమీకాదు. వాటికి ప్రత్యేక మహిమలుగాని, పవిత్రతగాని ఏమీలేవు. ఆనాటి వేదకాలంనాటివారు ఆచరణలో భౌతికవాదులుగా కనిపిస్తారు. వారి కవితల్లో చాలాచోట్ల భౌతికవాద భావనలు కనిపిస్తాయి కూడా. బంగారం, పుత్రప్రాప్తి, ఆరోగ్యం పొందటానికి అగ్ని, సోమరసం మొదలైన వాటిపై ఆధారపడినారు. ఈ ఆలోచనలు చాలాకాలం నడిచాయి. దీనికి కారణం ఆనాటి సాంఘిక ఆర్థిక పరిస్థితులే. ప్రాచీన కాలంనుండి 19వ శతాబ్దంలో ప్రథమ అర్థశతాబ్దంవరకు ఏ విధమైన మార్పుజరగకుండా సమాజం సాగిపోవడంవల్లనేని మార్క్స్ గుర్తించారు.

వేదాల్లో మొదటిది రుగ్వేదం. ఇందులో 1–187 పితృదేవత అగస్త్యుడు అన్న సూక్తంలో (కవిత్వంలో) ‘ఓ పితూ, పర్వతాల సంపద నీకే చెందుతున్నది. ఓ తీయని వాడా మామాటలు వినాలి. మాభోజనానికి దగ్గరగా వుండు. నీరు, మొక్కలు సమృద్ధిగా వుంటే సంతోషిస్తాము. కనుక ఓ శరీరమా నీవు లావుగా వుండాలి. ఉడకబెట్టిన యవ, కాగిన పాలతో కలిసినపుడు ఏర్పడే సోమరసం మాకు ఆహ్లాదం కలిగిస్తుంది. కనుక ఓ శరీరమా నీవు లావుగా పెరుగుదువుగాక’ ఇలా సాగే కవితలలో ‘వాపాతే

# ప్రసన్న కవి ప్రతిభ

*– గార్లపాటి దామోదరనాయుడు*

ప్రసన్న కవి' అనగానే 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ'– అనే గీతంతోపాటు ఆ గీతకర్త శ్రీ శంకరంబాడి సుందరాచారి తెలుగు సాహితీ ప్రియుల మదిలో కదలాడుతారు. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అనే తెలుగు జాతీయ గీతంతో తెలుగు ప్రజాహృదయాలను చూరగొన్న ప్రసన్నకవి శ్రీమాన్ శంకరంబాడి సుందరాచారి. అనేక రకాల పువ్వులతో మాలకట్టి శ్రీ శంకరంబాడి తెలుగు సరస్వతీదేవి మెడలో అలంకరించినా, మాలమధ్యలో "మణి"లాగ మా తెలుగు తల్లికి మల్లెపూదండ" గీతం నిలిచి ఉంది.

వీరు 10.8.1914న తిరుపతిలో జన్మించారు. తండ్రి రాజగోపాలయ్య, తల్లి కమలమ్మ. వారిది సంప్రదాయబద్ధమైన కుటుంబం, తాత శంకరంబాడి కృష్ణమాచార్యులుగారు, తిరుపతిలోని మిషన్ హైస్కూలులో సీనియర్ తెలుగు పండితులుగా ఉండేవారు. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ వీరిశిష్యులు.

సుందరాచారిగారు తిరుపతి దేవస్థానం హైస్కూలులో చదివి, మదనపల్లెలోని (బెసెంట్) థియోసాఫికల్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఆర్థికపరమైన ఇబ్బందులవల్ల, కళాశాలచదువు అంతటితోనే ముగిసింది. ఉద్యోగంకోసం తిరుగుతూ, మద్రాసులోని ఆంధ్రపత్రిక కార్యాలయంలో ఏడాదిపాటు సహాయ సంపాదకులుగా పనిచేశారు. తర్వాత, బెంగుళూరులోని హిజ్‌మాస్టర్స్ వాయ్సు కంపెనీలో చేరారు. పదకొండు నాటకాలు వ్రాశారు. కంపెనీవారు ప్రముఖ సినీనటులు చిత్తూరు నాగయ్యగారిద్వారా, వీటిల్ని రికార్డు చేయించారు.



శంకరంబాడి సుందరాచారి

శంకరంబాడి సుందరాచారిగారి పెళ్ళి జరిగిన తీరు విచిత్రంగా ఉంది. ఒకమారు కాంచీపురం వీథిలో వెళ్తున్నారు. దాహం వేసింది. మంచినీళ్ళకోసం ఒక ఇంటిఅరుగుమీద కూర్చున్నారు. ఆ ఇంట్లో ఎదిగిన అమ్మాయిఉంది. కూతురుపెళ్ళివిషయంలో తల్లిదండ్రులు తర్జన భర్జనలు పడుతున్నారు. అంతా విన్న సుందరాచారిగారు, ఇంటితలుపులు తట్టారు. మీ అమ్మాయిని నేను పెళ్ళి చేసుకుంటానని సంసిద్ధతను వెలిబుచ్చారు. 1939లో ఆ ఇంటి అల్లుడయ్యారు. చిత్తూరుజిల్లా బోర్డు హైస్కూలులో సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులుగా చేరారు. విద్యార్థుల మన్ననలందుకున్నారు. కానీ సినిమా పిలుపుపై ఉద్యోగానికి సెలవు పెట్టి మద్రాసు చేరారు.

దీనబంధుచిత్రానికి పాటలు వ్రాస్తూ, తెలుగు జాతివైభవప్రాభవాలు చిత్రించే "మా తెలుగు తల్లికీ మల్లెపూదండ" గీతం వ్రాసి దర్శకునికి ఇచ్చారు. అది ఆయనకు నచ్చలేదు. ఆ చిత్రంలో ఆ పాట పాడవలసిన సినీనటి టంగుటూరి సూర్యకూమారి గ్రామఫోనులో ఆ పాట పాడారు. కవిగారికి పారితోషికంగా రూ.116/– ఇప్పించారు. రేడియోలో స్వీయ కవితా గానంతో పాటు 'జపమాల' గేయ సంపుటి, బుర్రకథలు వ్రాయసాగారు. భార్య మానసికరుగ్మతకు గురికావటంతో, మరలా

# తెలంగాణా సుల్తాని

– దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు

శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు శతావధాని, బహుభాషా కోవిదుడు, శతాధిక గ్రంథకర్త. ప్రాచీన అధునాతన సాహిత్యాలను సమదృష్టితో సమాదరించారు. కావ్య రచన చేసిన కలంతోనే కథలు, నవలలు కూడా వ్రాశారు. శాస్త్రిగారు స్పృశించని సాహిత్య ప్రక్రియ లేదు. శతావధానం చేసిన ప్రజ్ఞాశాలి ఒక నాటికను వ్రాశారంటే నాటక సాహిత్యంపై వారికున్న అభిమానం ద్యోతకమవుతుంది.

వీరు 9 ఏప్రిల్ 1892న కృష్ణాజిల్లా చిరవాడ గ్రామంలో జన్మించారు. కథలు, నాటకాలు, నవలలు, ఖండకావ్యాలువంటి విభిన్న సాహిత్య ప్రక్రియల్లోనేగాక విమర్శకులుగానూ ప్రసిద్ధి చెందారు. 18 సంవత్సరాల వయసులలోనే 1911 గుంటూరులో సంపూర్ణ శతావధానం చేసిన మహా పండితులు. రష్యన్ సాహిత్యాన్ని తెలుగులోకి తీసుకు రావడంలో కృషి చేసినవారిలో వీరొకరు. టాల్‌స్టాయి, శరత్, రవీంద్రుని రచనలు అనువదించారు. జాతీయ ఉద్యమాన్ని ఇతివృత్తంగా చేసుకుని వచ్చిన తొలి స్వతంత్ర నవల ఓబయ్య (1920) రాశారు. వీరి ఖండకావ్యాలలో ఏకావళి (1940) పేరుపొందింది. గాంధీ మహాత్ముని ఆత్మకథ రెండు సంపుటాలుగా అనువదించారు. కృతి, వీధిబడి, దత్తు, క్షమాపణ, డిప్రెషన్, చెంబువంటి కథలు ప్రాచుర్యం పొందాయి. 'కథాషట్కము' కథానిక సంపుటి 1949లో వెలువడింది. రెండవది 'కథాసప్తకము' 1950లో వెలువడింది. ప్రాచీన భూగోళము – ప్రాచీన – ఖగోళము ' అనే శీర్షికలతో ఎన్నో పరిశోధక వ్యాసాలు రాశారు. మాధవవర్మ (చారిత్రక ) నాటకం, ప్రథమ పాంథికుడు, వేతసి, గురుదక్షిణ, అరణ్యపర్వ శేషోన్నయం, సుల్తానీ నాటకాలు, నాటికలు రాశారు. 17 మార్చి 1967 సమరణించారు. నిరక్షరాస్యులుగా వుంటూ, ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా తన కాళ్ళమీద నిలబడలేని దైన్యావస్థలో స్త్రీలు నేటి మన సమాజంలో పడుతున్న కష్టాలను 'సుల్తానీ' నాటికలో హృదయంగమంగా చిత్రించారు రచయిత. తెలంగాణా మాండలికంలో వున్న సంభాషణలు ఈ నాటికకు మరింత సహజత్వాన్ని సంతరించి పెట్టాయి. బాధాసర్పదష్టుల బ్రతుకుబాటలో గతుకులకు, అనంతమైన సమస్యల వలయాలకు ఈ విషాద నాటిక ఒక దర్పణం.

**నేపథ్యం:**

నేను కథకుణ్ణి కాదు, కవిత్వము రాసుకునేవాణ్ణి, అయినా నచ్చిన కథ గురించి వ్రాయడానికి కథానికా రచయితే కానక్కరలేదని భావించిన స్వాతి సంపాదకులు నాకు నచ్చిన కథను అందించమని కోరారు . అందరిలాగే నేనూ మంచివీ, చెడ్డవీ వేలాది కథలు చదివాను కానీ నా గుండెలో తిష్ఠ చేసున్నది శాస్త్రి *సులతానీ* కథ అని అంటారు. దాన్ని గురించి రెండు మాటలు సులతాని చాలా ముద్దుపేరు . అయినా అసలు పేరుకాదు. లోకులతోపాటు రచయిత కూడా సులతానీ అసలు పేరు మరచిపోయారు. సులతానుకు మారు మనువు వెళ్ళి సులతానీ అవుతుంది. సులతాను నిరంతరము తిట్టి, కొట్టి హింసించినా నిర్భరమైన ప్రేమతో భరిస్తుంది సులతానీ, కలవారి ఇంట్లో అంట్లు తోమి భర్తకు సాయపడుతూ వుంటుంది . రెండవ మగడు చావగొట్టినప్పుడు మొదటి మగడు పరమానందాయి జోక్యము కలిగించుకొనజూస్తే తీవ్రముగా వారిస్తుంది. సులతానుకు శిక్ష పడినపుడు తానే ఆ శిక్షను అనుభవిస్తుంది. పాత మగనిదగ్గర ఉన్నప్పుడు తాను కూడబెట్టిన కాసులు అతనికే చెందాలని, కొత్త మగనికి చెందకూడననీ ధర్మ నిర్ణయం చేస్తుంది. ఆశ్రయ మిచ్చిన పురుషుణ్ణి దేవుడిగా కొలుస్తుంది. మన నీతిశాస్త్రాలకు అర్థంకాక పోయినా ఆమెకూ ఒక నీతి అంటూ ఉంది. ప్రాణాలయినా ఇచ్చే నేస్తం నాది. మళ్ళా నాకుమల్లే ప్రాణాలిచ్చే నేస్తం నాకు దొరకలేదు.


వేదం వేంకటరాయశాస్త్రి

# బొబ్బిలి నాటక ప్రాశస్త్యం

– *కె. దామోదరనాయుడు*

వేదం వేంకటరాయశాస్త్రి బహుముఖ ప్రజ్ఞావంతులు. అనేకానేక గ్రంథాలు వ్రాసిన సంస్కృతాంధ్ర భాషా ప్రవీణులు. వారు చేబట్టిన ప్రతిరచన అద్వితీయమనడం సహజోక్తి. ప్రత్యేకించి వేదంవారు నాటక రచనలలో కూడా సిద్ధహస్తులనడానికి వారి అనువాద రచనలేగాక స్వతంత్ర నాటకాలు కూడా కారణాలే. వారి ప్రతాప రుద్రీయం, బొబ్బిలియుద్ధ నాటకాలు వారి కీర్తిప్రతిష్ఠలను పెంచిన రచనలు. ఈ రచనల ప్రాశస్త్యానికి సుమారు పది కారణాలు కనిపిస్తున్నాయి.

1. వేదం వేంకటరాయశాస్త్రిగారు జీవించిన కాలంలో ఆంధ్రదేశంలోని ప్రజలు చాలావరకు రసపుత్రుల కథలను కావ్యాలుగా, గేయాలుగా, నాటకాలుగా, నవలలుగా తీర్చిదిద్దేవారు. అందుకు భిన్నంగా వేదంవారు రసపుత్రుల సాహసోపేత ఆత్మార్పణ గాథలకు తీసిపోనట్లు ఆంధ్రుల ప్రత్యేకించి తెలుగు గడ్డలోని వారి ఇతివృత్తాలను తీసుకొని నాటకాలు వ్రాయడం. ప్రతాప రుద్రీయం తెలంగాణా గడ్డలోని కథకాగా, బొబ్బిలియుద్ధం సాగర తీర ప్రాంతంలోని రాజుల కథ కావడం విశేషం. పాండిత్యం కోసంగాక శ్రీవిక్రమ సింహపురి ఆంధ్ర భాషాభిమాన సమాజంవారి కోరికతో వ్రాయడం.

2. వేదంవారు బొబ్బిలియుద్ధ నాటకం వ్రాయడానికి ముందే తెలుగులో కైఫీయత్తులు, గెజిటర్లలో బొబ్బిలివారి వృత్తాంతాలున్నాయి. అంతేగాక దిట్టకవి రంగరాయ చరిత్రముంది. శాస్త్రిగారు శిష్యులయిన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రివారి 'బొబ్బిలియుద్ధ' నాటకముంది. ఇంతేగాక ప్రజలలో బాగా వ్యాప్తిపొందిన జంగం కథలున్నాయి. కావ్యమన్న తరువాత కవి వర్ణాలకు, అలంకారాలకు ప్రాధాన్యం ఇవ్వక తప్పదు. వాటిలో సహజేతివృత్తం కంటే మార్పు చేసిన అనేక సన్నివేశాలుంటాయి. ఆ కారణాలవల్ల వేదంవారు జన సముదాయంలోని బొబ్బిలి పాటలనే ప్రధాన ఆకరాలుగా తీసుకున్నారు. ఈ అంశాన్ని డా. పి. వేంకటరాయ శాస్త్రి గారు తెలుగులో చారిత్రక నాటకాలు అనే సిద్ధాంత గ్రంథంలో మూడవ ప్రకరణలో నిరూపించారు.

3. రసదృష్టితో పరిశీలిస్తే వేదంవారు వీర, కరుణ రసాలకు తగిన మేళనం చేసి రచించిన నాటకం 'బొబ్బిలియుద్ధ నాటక' మని చెప్పవచ్చు. నాటకం పేరే 'యుద్ధం'. యుద్ధంలో వీరరౌద్ర బీభత్సాలకే ప్రాధాన్యం. కాని నాటకాలలో రంగస్థలాల్లో యుద్ధాలు చూపడానికి వీలులేదు. అయినా శాస్త్రిగారు 5వ అంకంలో దూరాన జరిగిన యుద్ధాన్ని బుస్సీ ఎదుట నలుగురిని కథకులచేత మార్చి మార్చి చెప్పించి యుద్ధం జరిగినట్లే కళ్ళెదుట కనిపించేటట్లు చేసి నేటి చలన చిత్రాలలోవలె ప్రత్యక్షంగా చూపగలిగారు.

'కరుణరస పోషణలో శాస్త్రిగారు 'భవభూతి భుజములొరసినారని' శ్రీమరుపూరి కోదండ రామిరెడ్డి గారి అభిప్రాయం. బొబ్బిలియుద్ధ నాటకంలో ఈ కోవలోనివి ఎన్నో ఉన్నా ప్రత్యేకించి రాణి మల్లమ్మ

# సాంకేతిక భాషా వికాసం




*– డి.వి.ఎన్.డి. లక్ష్మి*

**ప్రస్తావన:**

సంస్కృతికి వచో రూపమే భాష. భాషకి ప్రాణ కల్పమైనది భావం. భావగర్భిత భాషకి లిపిరూపమె సారస్వతం. ఆ లిపిరూపం సారస్వతానికి సాంకేతిక విశ్వరూపమె అంతర్జాల ప్రదర్శనం.

సృష్టికర్త బ్రహ్మ సిస్టం "ఇన్ స్టాలర్". చీకు చింతలకు దూరంగా నడిపించే వాడే నారాయణుడు. ఆయన "సిస్టం సపోర్టర్". శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు కాబట్టి 'సిస్టం ఆపరేటర్" ఆయనే.

ఇలా త్రిమూర్తిమత్వాన్ని కంప్యూటర్ పరిభాషలో అనువదించాడు ఒక అజ్ఞాత నిపుణుడు– 'కంప్యూటర్ తెరపై తెలుగు తళుకులు " డా. పి.వి. లక్ష్మణ రావు, Telugu Faculty; IIIT Nuzvid; Krishna District.

నిజానికి నేడు కంప్యూటర్ లేకుండా జీవితాలని నడపడం దురూహ్యం...మినీ కంప్యూటర్–మొబైల్ ఫోన్ లేకుండా పూట గడవడం పూర్తిగా అసాధ్యం. అంతగా పెనవేసుకుపోయింది సాంకేతికత మానవ జీవితాల్లో అనడం అసంగతం కాదు. దుస్సాహసం అంతకన్నా కాదు.

ఇంతకు మునుపు విద్యా విధానంలో భాషా సాహిత్య శాస్త్రాలు ఒక శాఖగాను, భౌతిక/జీవ/ రసాయన/సాంకేతిక శాస్త్రాలు ఒక శాఖగాను, సామాజిక శాస్త్రాలు మరో శాఖ గాను ఒకదానికి మరొటి అతీతంగా ఉండేవి.

అలాగే బోధన కూడా తదనుగుణంగానే ఉండేది.

కానీ "నదీనాం సాగరో గతిః" అన్నట్లు సాంకేతికత పుణ్యమా అని అన్ని శాఖలు కంప్యూటర్ రంగంలో విలీనమై అవ్యాజమైన అవినాభావ సౌభ్రాతృత్వాన్ని సంతరించుకు వస్తున్నాయి. ఇటు విద్యా వికాసానికి కాదు, సామాజిక జీవన విధానాన్నీ, అవసరాలనీ కూడా శాసిస్తోంది. అలాగే నూతన ఉపాధి అవకాశాలని సహితం విరివిగా కల్పిస్తోంది కంప్యూటర్ రంగం.

గ్లోబల్ విలేజ్‌గా అత్యంత వేగంగా మార్పు చెందుతోంది నేటి ప్రపంచం. అటువంటి దశలో ప్రపంచ దేశాలన్నీ ముఖ్యంగా భారతదేశాన్నీ ఐదు రంగాలు అత్యధికంగా ప్రభావితం చేస్తున్నాయి, అవి:

1. కంప్యూటర్ రంగం, 2. జర్నలిజం రంగం, 3. విద్యా రంగం, 4. వ్యాపార రంగం, 5. వైద్య రంగం.

విద్యారంగం సైతం కమర్షియలైజ్ అయిపోయి కార్పొరేట్ లెవెల్‌కి చేరిపోతే వాటిల్లో మన సమాజం, సాహిత్యం, సాంఘిక విలువలు కూడా వేగంగా మార్పు చెందుతున్నాయి. ఆ వేగాన్ని అందుకోవడానికి అందుకు తగిన ఆలోచనలనీ, అవగాహననీ పెంచుకోవడానికి జీవనోపాధికి కావలసిన వికాసాన్ని, ఆర్థిక స్వావలంబననీ కూడా ఈ 5 రంగాలు ఏ రకంగా దోహదం చేస్తున్నాయో, ఉపకరిస్తున్నాయో విశ్లేషించి వివరించుకుందాం.

30 కోట్ల ఈ మెయిల్స్....20 లక్షల గూగుల్ సర్చెస్...13 లక్షల యూట్యూబ్ వీడియో వ్యూస్... 8 లక్షల ఫేస్‌బుక్ అప్‌డేట్స్.. .7 లక్షల జె.బి.ల ఇన్ఫర్మేషన్..కేవలం 60 సెకన్లలో అంతర్జాలంలో జరుగుతున్న వర్తమాన వివరణ. –"అంతర్జాలంలో

# రాయలసీమ రైతు కథ

*- కరణం శ్రీనివాసులు రెడ్డి*

చారిత్రక, భౌగోళిక, భాష, సాంస్కృతిక, రాజకీయ అంశాల దృష్ట్యా పరిశీలించినప్పుడు రాయలసీమ ప్రాంతం ప్రతి అంశంలోనూ తనదైన ప్రత్యేకతను, విశిష్టతను కలిగి వుంది. ఈ విభిన్నత సాహిత్యంలోనూ కనిపిస్తుంది. సీమ సాహిత్యం మొదటి నుండి ఇప్పటి వరకు కుడా వస్తువు, ప్రక్రియ, తాత్విక దృక్పథం వంటి అంశాలలో తన ప్రత్యేకతను చాటుతున్నది. అందుకే రాయలసీమ సాహిత్యాన్ని ప్రత్యేక దృష్టితో అధ్యయనం చేయాల్సిన అవసరం వుంది.

ఆది మానవుడి అడుగుజాడలు సీమ ప్రాంతంలో అడుగడుగునా అగుపిస్తాయి. పాత రాతి యుగ ఉత్తర దశ, నవీన శిలా యుగము ఇక్కడ ఉచ్ఛస్థితిలో వెలిగినట్లు ఆధారాలున్నాయి. కర్నూలు జిల్లాలోని బెలుం గుహలు, చిత్తూరు జిల్లాలోని రాక్షస గుళ్ళు వీటికి ఆధారాలు. నవీన శిలా యుగం నాటికే రాయలసీమలో సేద్యం చేసిన గుర్తులు కనిపిస్తున్నాయి. చారిత్రక పూర్వ యుగం నుండే ఇక్కడ రైతున్నాడు. అందుకే ఆంధ్ర దేశంలో రైతు అంటేనే రాయలసీమ వాసి కళ్ళ ముందు కదులుతాడు.

వేటాడే వరకు మనిషి మృగ సమానుడే. ఆ తర్వాతే మట్టికి ప్రాణం పోసి చెట్టుగా మొలిపించే రైతయ్యాడు. అలా వ్యవసాయంతోనే మనిషి నాగరికుడయ్యాడు. మానవుడి మొదటి ఉత్పత్తి కార్యం వ్యవసాయమయ్యింది. ఆ ఉత్పత్తి సంబంధాలే క్రమంగా సమాజం, సంస్కృతిగా పరిణమించాయి. ఈ క్రమంలో భూమి, పైరు, నీరు, నాగలి, పశువులు, పనీ-పాటలు మానవ జీవితంలో భాగమయ్యాయి. అప్పట్లో వ్యవసాయమే ప్రపంచాన్ని నడిపించింది. రైతు రాజుగా వెలిగాడు. నాగలి నాగరికతా చోదక శక్తిగా ముందుకు సాగింది. భారతీయ రైతు ఒక సహజ శాస్త్రవేత్తగా ప్రకృతితో సహజీవనంలాంటి జీవన విధానాలను, ప్రకృతికి హాని చేయని వ్యవసాయ పద్ధతులను అభివృద్ధి చేశాడు. మన దేశానికి సంబంధించి వ్యవసాయం ఒక వృత్తి కాదు. అదొక జీవన విధానం.

ఈ నేపథ్యంలోంచి చూసినపుడు రాయలసీమ నాగరికతా ప్రస్థానంలో ముందు వెళ్ళే మడకగా సాగుతూ ఉండేదనిపిస్తుంది. శాతవాహనులు, కాకతీయులు, విజయనగర రాజుల కాలంలో రాజులు వ్యవసాయ ప్రాధాన్యాన్ని, రైతు ప్రాముఖ్యాన్ని గుర్తించి చెరువులు, కాలువలు విరివిగా నిర్మించారు. దీంతో రైతు జీవితం కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా సస్యశ్యామలమైంది. విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత రాయలసీమ రైతు జీవితంలోనూ కడగండ్లు మొదలయ్యాయి. అవి నేటికీ కొనసాగుతూ ఉండటమే వర్తమాన విషాదం. దీనికి తోడు నదులు లేకపోవడం, వర్షాభావం, కరువులు, నిరక్షరాస్యత వంటివి రాయలసీమ రైతు కష్టాలను తీవ్రతరం చేసాయి. విజయనగర కాలంనాటి పాలెగాళ్ళ వ్యవస్థ, బ్రిటిష్ పాలన, ఉమ్మడి మద్రాసులో మనం భాగస్వాములు కావడం, వేళ్ళూనుకున్న భూస్వామ్య వ్యవస్థ, పాత పైని మమకారం, పరిశ్రమలు లేకపోవడం వంటివి

# అన్నమయ్య వలపు రాగాలు

– గూడూరు యానాదిరాజు

సౌందర్యాన్ని ఆస్వాదించగల ఒకానొక సహజ మృదు స్వభావాన్ని శృంగారం అన్నారు పెద్దలు. ఆ శృంగార భావం పుష్కలంగా ఉన్న భావుకుడు అన్నమయ్య. శృంగార సంకీర్తనలలో అన్నమయ్య కీర్తించిన నాయకుడు శ్రీ వేంకటేశ్వరుడు ఒక్కడే. నాయికలూ అలమేల్మంగతో సహా అనేకమంది. ఆ నాయకుని రతిక్రీడా రహస్యాలన్నీ అన్నమయ్య స్వయంగా చూసినంత తాదాత్మ్యతతో, గాఢమైన వలపుతో తాను నాయికల పక్షం వహించి మరీ... ఎంతో శృంగారమైన రీతిలో సంకీర్తనాగానం చేశాడు. నాయకుడు భగవంతుడు గనుక అతడిపై తాళ్లపాక అన్నమయ్యకు ప్రగాఢమైన భక్తి ఉంది. అన్నమయ్య పూర్వీకుల కాలంనుండి శ్రీ చెన్నకేశవ స్వామి కొలువై ఉన్న ప్రధాన వైష్ణవాలయం తాళ్లపాకలో విరాజిల్లుతుంది. ఆ గుడిలో తామరలవంటి కన్నులగల శ్రీకృష్ణుడు కేశవుడిగా కొలువై యున్నాడు. ఉప ఆలయంలో సుదర్శన చక్రం మరియు దోగాడే చిన్ని కృష్ణుడు కూడ ఉన్నాడు. ఈ ఆలయంలో పూర్వం పావురము ఉంచిన పెట్టె ఉండేదట. సంతానహీనులైన దంపతులు పావురము పెట్టెను భక్తిశ్రద్ధలతో పూజిస్తే సంతానవతులవుతారని యిక్కడి ప్రజల విశ్వాసం. సంతానఫలం పొందడానికి ముఖ్యమైన హేతువు సతీపతుల సంయోగం. అందుకు రతీమన్మథుల్లా స్త్రీ పురుషులు యోగించడానికి అందమైన అపురూపమైన శృంగారం ఉండాలి. దేవుని శృంగారాన్నే ప్రేరణగా చూపాడు అన్నమయ్య. అలమేల్మంగ వేంకటేశ్వరుల దాంపత్యమే అందుకు ఆదర్శం. అన్నమయ్య సైతం సంసార జీవితంలో ఆ ప్రభావానికి అతీతుడు కాలేకపోయాడు. దీన్నే లోక ప్రభావం అనవచ్చు. ఇలా శృంగారాన్ని రక్తి కట్టించడంకోసం పావురము, చిలుకల ప్రమేయాన్ని కూడ తన కీర్తనలలో ప్రత్యేకంగా ప్రస్తావించాడు అన్నమయ్య. చిలుక మన్మథుని వాహనం. పావురము రతిదూతిక. శృంగారపరంగా నాయికా నాయకులకి ఎంతటి ప్రాధాన్యత ఉన్నదో ఆయన సాహిత్యంలో వారి మధ్య సంధానకర్తలుగా దూతికలకికూడ అంతే ప్రధాన్యం వుంది. ఈ పావురమే ప్రేమికులమధ్య రాయబారిగా సందేశాలను పంపి వారిలో ప్రేమశృంగారాలను వృద్ధికి తెస్తుంది. దీనికి దృష్టాంతమే ఈ శృంగార కీర్తన....

***మేడ లెక్కి నిన్ను జూచి కూడే ననే యాసతోడ***
***పావురము రెక్క జీటి నీ వొద్దికి గట్టి యంపి***
***దేవరకే మొక్కుకొందురా వెంకటేశ***
*నీవిందు రావలెనంటాను* (7-223)



పై సన్నివేశాన్ని చక్కగా గమనిస్తే పావురమును చిహ్నముగా కలిగి సమాచారము, సందేశాలు వేగంగా బదిలీ చేస్తున్న అంతర్జాతీయ తపాలా, అంతర్జాలంలో ట్విట్టర్ గుర్తుకొస్తున్నాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Misimi+April+2018**

* * *